సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 19 । ఆగస్టు । 2025

జల సంబురం



రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లోకి సోమవారం నీటిని పంపింగ్ చేశారు. ఇరిగేషన్ అధికారులు ఉదయం ఒక మోటారు ద్వారా పంపింగ్ ప్రారంభించారు. రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లోకి గోదావరి జలాలు విడుదల చేయాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. రంగనాయక సాగర్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు గోదావరి జలాలకు హారతి ఇచ్చి గంగమ్మతల్లికి పూజలు చేశాయి. కేసీఆర్, హరీశ్‌రావు ముందు చూపుతోనే ప్రతి యాసంగికి నీళ్లు అందించారని మాజీ ఎంపీపీలు మాణిక్యరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ పేర్కొన్నారు. – చిన్నకోదూరు(సిద్దిపేట)

రంగనాయక సాగర్‌లోకి పంపింగ్ అవుతున్న గోదావరి జలాలు, బీఆర్ఎస్ నేతల సంబరాలు

న్యూస్‌రీల్

రాకపోకలకు ఇబ్బందులు ఉండొద్దు

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



పోసాన్‌పల్లిలోని గుండ్ల చెరువును పరిశీలిస్తున్న గరీమా అగర్వాల్

కొమురవెల్లి(సిద్దిపేట)/మర్కూక్(గజ్వేల్): కొమురవెల్లి మండలంలో పలు చెరువులు నిండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. మండలంలోని పోసాన్‌పల్లి గుండ్ల చెరువుతోపాటు పలు చెరువులను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. మండలంలో ఆదివారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పలు రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లపైకి వరద నీరు చేరడంతో పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చేబర్తి నుండి పాతూరు వెళ్లే రోడ్డును అదనపు కలెక్టర్ పరిశీలించారు. వరద ఉధృతి ఉన్న రోడ్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వరద తగ్గిన వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈ శ్రీధర్, ఏఈ అభిలాష్, రైతులు పాల్గొన్నారు.

వంశీకృష్ణకు అభినందనలు



శీకృష్ణను సత్కరించిన మంత్రులు పొన్నం, శ్రీహరి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం చౌటపల్లికి చెందిన పులికాశీ వంశీకృష్ణ రాష్ట్ర కబడ్డీ ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికయ్యారు. సోమవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. క్రీడలకు పుట్టినిల్లుగా చౌటపల్లి గ్రామంలో అనేక మంది వివిధ క్రీడల్లో రాణిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రో కబడ్డీ క్రీడాకారుడు గంగాధరి మల్లేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, యూత్ నాయకులు చుంచు రాకేష్, పులికాశీ రమేష్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వాగు ప్రవాహాన్ని పరిశీలించిన శ్రీనివాస్‌రావు

తొగుట(దుబ్బాక): కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని దుబ్బాక నీటిపారుదల శాఖ డీఈఈ చెన్ను శ్రీనివాస్‌రావు తెలిపారు. మండలంలోని కూడవెల్లి వాగుతో పాటు గ్రామాల్లో చెరువులను సోమవారం పరిశీలించారు. చేపలు పట్టేవారు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. మండలంలో 142 చెరువులు, కుంటలు ఉన్నాయని అందులో 29 ఇప్పటికే నిండి అలుగు పారుతున్నాయని చెప్పారు. వర్షం కురుస్తుండటంతో వరద పెరిగి వాగులోకి నీరు ప్రవహిస్తుందన్నారు. రైతులు, గొర్లకాపరులు వాగులోకి వెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈ అస్మజబీన్, సిబ్బంది పాల్గొన్నారు.

టీఎల్ఎం మేళా.. భళా



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

హుస్నాబాద్: బోధన సామగ్రితో విద్యార్థులకు చదువు చెప్పడం వల్ల ప్రతి అంశం సులువుగా అర్థమవుతుందని ఎంఈఓ బండారి మనీల అన్నారు. మండల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి టీఎల్ఎం (టీచింగ్, లర్నింగ్, మెటీరియల్) మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు వివిధ ఎగ్జిబిట్లను ప్రదర్శించారని తెలిపారు. 52 మంది ఉపాధ్యాయులు అన్ని సబ్జెక్టులు కవర్ అయ్యేలా ఎగ్జిబిట్లను తయారు చేసి, విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. ఇందులో పది ఎగ్జిబిట్లను ఎంపిక చేసి జిల్లా టీఎల్ఎం మేళాకు పంపించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ఇదేదో తమ అభిమాన నటుడు సినిమా చూసేందుకు టిక్కెట్ల కోసం అభిమానులు కట్టిన క్యూ లైన్ కాదు. పుణ్య క్షేత్రాలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తుల క్యూ లైన్ అంతకంటే కాదు. ఎండనకా, వాననకా. నిరంతరం కష్ట పడుతూ ప్రజల కడుపు నింపే అన్నదాత యూరియా కోసం పడుతున్న పాట్లు ఇవి.



2 సంచులు.. 8 గంటలు

యూరియా కోసం రైతన్న పాట్లు

- తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో..
- గంటల తరబడి నిరీక్షించినా దొరకని వైనం
- కొంతమందికి ఇచ్చి మమ అంటున్న అధికారులు

వేల మంది రైతుల క్యూ లైన్

దుబ్బాకకు యూరియా వచ్చిందనే తెలియగానే మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు ఉదయాన్నే వచ్చి క్యూలైన్ కట్టారు. వచ్చిన 560 యూరియా బస్తాల కోసం రెండు వేల మందికి పైగా లైన్ కట్టడం విశేషం. పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది.

కౌంటర్ వద్ద తొక్కిసలాట



దుబ్బాకటౌన్: రైతులు యూరియా సమస్యతో సతమతమవుతున్నారు. సరిపడా యూరియా అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు అయిపోతుందో తెలియని గందరగోళ పరిస్థితి. యూరియా వచ్చిందని తెలియగానే పరుగులు పెట్టడం.. పెద్ద క్యూ కట్టి గంటల తరబడి నిరీక్షించినా.. చివరకు సంచి బస్తా దొరుకుతుందో లేదో అన్న ఆందోళన వారిని పట్టిపీడిస్తోంది. ఇది కొంతకాలంగా రైతన్నకు కునుకులేకుండా చేస్తోంది. యువకులు, వృద్ధులు, మహిళలు అనే తేడా లేకుండా వానను సైతం లెక్క చేయకుండా సోమవారం దుబ్బాక పీఏసీఎస్‌కి యూరియా వచ్చిందని తెలియగానే తెల్లవారుజామున ఐదు గంటలకు నిద్ర లేచి క్యూ లైన్ కట్టారు. రెండు సంచుల యూరియా కోసం ఏకంగా ఎనిమిది గంటల నిరీక్షణ తప్పడం లేదంటూ రైతన్నలు వాపోతున్నారు.

ఏఓతో రైతుల వాగ్వాదం

వేకువ జాము నుంచి యూరియా కోసం వేచి చూసినా దొరకకపోవడంతో మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్‌తో రైతులు వాగ్వాదానికి దిగారు. ఏఓ వ్యవహరించే తీరుతోనే తమకు యూరియా దక్కడం లేదంటూ ఆందోళనకు దిగారు. ఏఓ కనుసైగల్లోనే యూరియా పక్కదారి పడుతుందని వారు ఆరోపిస్తున్నారు. దీంతో ఎస్ఐ కీర్తిరాజు రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు.

ఉదయం 5 గంటలకే వచ్చిన..



యూరియా వచ్చిందని తెలియగానే నేను దుబ్బాక మండలం హబ్సీపూర్ నుంచి ఉదయం 5 గంటలకే ఆటోలో వచ్చిన. 6 గంటలు లైన్‌లో ఉన్నా టోకెన్ మాత్రం దొరకలే. గిట్లయితే పంటల పరిస్థితి ఎట్ల. రైతులకు యూరియా ఇచ్చి ఆదుకోండి.

–గౌరవ్వ, మహిళ రైతు, ధర్మాజీపేట

శాతకాకున్న వచ్చిన..



మాది దుబ్బాక మున్సిపల్ ధర్మాజీపేట గ్రామం. యూరియా వచ్చిందని తెలవంగనే పొద్దుగల్లనే లేచి శాతకాకున్న వచ్చిన. ఈ లైన్‌లో నిలబడడం నాతో కావడం లేదు. అధికారులు కనీసం రైతులను పట్టించుకుంటలేరు. గిట్లయితే వ్యవసాయం ఎట్లా చేస్తాం సారూ.

–మల్లయ్య, రైతు, ధర్మాజీపేట

గజ్వేల్ కాంగ్రెస్‌లో గ్రూపుల గోల

- రెండు వర్గాలుగా చీలిన వైనం
- పరస్పరం అధిష్టానానికి ఫిర్యాదులు


గజ్వేల్: గజ్వేల్ కాంగ్రెస్‌లో గ్రూపుల గోల తారాస్థాయికి చేరుకున్నది. ఈనెల 3వ తేదీన పట్టణంలో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు పార్టీలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో తనను కులంపేరుతో దూషించి దాడి చేశారని కొండపాకకు చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు.. డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఇదే క్రమంలో ఈనెల 15న సిద్దిపేటలోనూ అట్రాసిటీ కేసు నమోదైంది. అనంతరం గజ్వేల్ కాంగ్రెస్ నర్సారెడ్డి వర్సెస్ ఆయన వ్యతిరేక వర్గీయులుగా కార్యకలాపాలు సాగుతున్నాయి. ఆదివారం విజయ్‌కుమార్ సహా కొందరు నేతలు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవిని కలసి నర్సారెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై విచారణకు పార్టీ అధిష్టానం ప్రత్యేక కమిటీని నియమిస్తున్నట్లు వార్తలొచ్చాయి. తాజాగా సోమవారం విజయకుమార్‌పై నర్సారెడ్డితోపాటు మాజీ కార్పొరేషన్ చైర్మన్లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, నియోజకవర్గంలోని మార్కెట్ కమిటీ చైర్మన్‌లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయమోహన్ తదితరులు హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. గత గజ్వేల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్‌కుమార్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోసం పనిచేశారని, ఎంపీ ఎన్నికల్లో రఘునందన్‌రావుకు అనుకూలంగా వ్యవహరించారని ఫిర్యాదు చేశారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జైభీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమాల్లోనూ విజయ్‌కుమార్ పాల్గొనలేదని తెలిపారు. అలాగే.. భూకబ్జాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. మొత్తానికి రెండు వర్గాల ఫిర్యాదుల పర్వం ప్రస్తుతం హాట్‌టాపిక్ మారింది. గ్రూపుల కట్టడికి అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోబోతుందనే అంశంపైనే ప్రస్తుతం అందరి దృష్టి కేంద్రీకృతమై ఉన్నది.



పీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, తదితరులు

అప్రమత్తంగా ఉండండి

సీపీ అనురాధ



మిరుదొడ్డి: అల్వాల కూడవెల్లిలో లెవల్ వంతెన వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీపీ అనురాధ

మిరుదొడ్డి(దుబ్బాక): అకాల వర్షాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. మండల పరిధిలోని అల్వాల శివారులోని కూడవెల్లి లోలెవల్ బ్రిడ్జి పైనుంచి ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వరదను సోమవారం ఆమె పరిశీలించారు. వాగుకిరువైపులా దారులను మూసివేసి బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్న వాగులను ఎవరూ దాటే ప్రయత్నం చేయవద్దని సీపీ అన్నారు. ఆమె వెంట సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, దుబ్బాక సీఐ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలని సిద్దిపేట సీపీ అనురాధ పోలీస్ అధికారులను ఆదేశించారు. మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, సీజ్ చేసిన వాహనాలను, రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కుమ్మేసిన వాన

- అతిభారీ వర్షం.. రాష్ట్రంలోనే అత్యధికం
- గౌరారంలో 23.6 సెం.మీ వర్షపాతం నమోదు
- మునిగిన పంటలు.. ఉప్పొంగిన వాగులు, చెరువులు
- ముంపు పొలాలు, రోడ్లను పరిశీలించిన కలెక్టర్



గౌరారంలో ఇండ్లలోకి చేరిన వరదనీరు



నాచగిరి చెక్‌డ్యాం వద్ద మహోగ్రంగా ప్రవహిస్తున్న హల్దీవాగు

వర్గల్(గజ్వేల్): భారీ వర్షం అతలాకుతులం చేసింది. మున్నెన్నడులేని అతిభారీ వర్షంతో హల్దీవాగు ఉగ్రరూపం దాల్చింది. వరద తాకిడికి ఖాన్‌చెరువు ఉప్పొంగింది. నాచగిరి వద్ద హరిద్రనది పొంగిపొర్లింది. రోడ్లపై రాకపోకలకు స్తంభించిపోయాయి. చందాపూర్ వద్ద రోడ్డు మీదుగా వరద ఉధృతితో గ్రామానికి వెళ్లే దారి మూతపడింది. వర్గల్ మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన కుండపోత వర్షంతో పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపించాయి. వర్గల్ మండలం గౌరారంలో రాష్ట్రంలోనే అత్యధిక స్థాయిలో 23.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండల వ్యాప్తంగా 22.8 సెంటీమీటర్ల వర్షం పడగా.. మొక్కజొన్న, పత్తి, వరి పైర్లు వరదనీటిలో మునకేశాయి. అంబర్‌పేట–శాకారం రోడ్డుపై భారీగా ఖాన్‌చెరువు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ఒక వాహనం నీటి మధ్యలో నిలిచిపోవడంతో గ్రామస్తులు ట్రాక్టర్లు, జేసీబీలతో గట్టెక్కించారు. పోలీసులు రాకపోకలను నిలిపేశారు. చందాపూర్–బొర్రగూడెం మార్గంలో లోలెవెల్ కల్వర్టు వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చందాపూర్‌కు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గౌరారంలో పలువురి ఇళ్లలో నీరు చేరడంతో ఇబ్బందిపడ్డారు. రాజీవ్‌రహదారిపైకి వరద ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అవాంతరం ఏర్పడింది. చెరువులన్నీ మత్తడి దూకుతున్నాయి. కాగా మండలంలో 2,945 ఎకరాల్లో వరి, 237 ఎకరాల పత్తి, 81 ఎకరాల్లో మొక్కజొన్న, 129 ఎకరాలలో కూరగాయ తోటలు నీటిలో మునిగిపోయినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఏఓ శేషశయన తెలిపారు.

వర్షంలోనే కలెక్టర్ పర్యటన

వర్గల్ మండలంలో వర్ష తీవ్రత, పంటల స్థితిగతి, జలాశయాలు, రవాణాపరమైన ఇబ్బందులు పరిశీలించేందుకు సోమవారం కలెక్టర్ హైమావతి, గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళతో కలిసి పర్యటించారు. వర్షం లెక్కచేయకుండా గొడుగు పట్టుకుని క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులకు ఎక్కడికక్కడ దిశానిర్దేశం చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అంబర్‌పేట ఖాన్‌చెరువు, వేలూరు రంగం చెరువు, సీతారాంపల్లి తదితర ప్రాంతాలు పర్యటించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

యూరియా, ఎరువల లభ్యతపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాకు ప్రభుత్వం సరాఫరా చేస్తున్న యూరియాను సరిగ్గా చేర్చేందుకు కావాల్సిన ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అవసరమైన యూరియాను త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పాఠశాలల బంద్

సిద్దిపేటరూరల్: భారీ వర్షాల కారణంగా జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ హైమావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వర్గల్, మర్కుక్, జగదేవపూర్, గజ్వేల్, కుకునూరుపల్లి, కొమురవెల్లి, మిరుదొడ్డి మండలాల్లో వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని పేర్కొన్నారు. అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించదని, దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అనుకుంటే తప్ప ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటికి రావొద్దని సూచించారు. ఎలాంటి అవసరానికైనా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 08457-230000 ను సంప్రదించాలని ఆమె కోరారు.



వర్గల్: మజీద్‌పల్లి రైతువేదిక చుట్టూ నిలిచిన వరదనీరు



ములుగు: అల్లీనగర్‌లో ఈదుల్ల కుంట కట్ట తెగడంతో మునిగిపోయిన పంటలు

ముంపు బాధితులను ఆదుకుంటాం

ములుగు(గజ్వేల్): మండలంలోని తున్కిబొల్లారం అయ్యప్ప చెరువులోకి వరద నీరు చేరి ముంపునకు గురైన బుడిగ జంగాల కుటుంబాలను కలెక్టర్ హైమావతి సోమవారం సాయంత్రం కలిశారు. మీ సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని, అధైర్యపడొద్దని భరోసా కల్పించారు. ముంపునకు గురైన కుటుంబాలకు ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం కల్పించి భోజన వసతి ఏర్పాటు చేయాలని ఎంపీడీఓకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.



తున్కిబొల్లారంలో బాధిత కుటుంబాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

క్లుప్తంగా

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: రాబోయే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వివిధ శాఖల అధికారులతో కలిసి పోలీసు సిబ్బంది సమష్టిగా సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, పోలీసులు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల వల్ల ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా డయల్ 100 లేదా పోలీసు కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712 667 100కు ఫోన్ చేయాలని సూచించారు.

సీసీ కెమెరాలో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి, మెదక్ జిల్లాల గ్రామీణ యువత కోసం సీసీ కెమెరాల సర్వీసింగ్‌లో స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్రం డైరెక్టర్ రాజేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 ఏళ్ల లోపు వారు అర్హులని, వివరాలకు 94901 03390, 94901 29839 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఇళ్లు కూలి.. ముగ్గురికి గాయాలు



పత్తికుంట తండాలో కూలిన ఇల్లు

పుల్‌కల్(అందోల్): భారీ వర్షాలకు మండలంలోని పాత ఇళ్లు కూలుతున్నాయి. పత్తికుంట తండా, పోచారం గ్రామంలో సోమవారం ఇళ్లు కూలడంతో ముగ్గురు గాయపడ్డారు. పత్తికుంట తండాలో తేజావత్ జితేందర్ ఇళ్లు కూలి మట్టి పెళ్లలు మీద పడటంతో ఆయనతోపాటు కుటుంబ సభ్యులు సునీత, కార్తీక్‌కు గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను ఎస్‌ఐ విశ్వజన్ , ఎంపీఓ వేంకటేశ్వర్ రెడ్డి పరామర్శించారు. బాధితులకు కొత్త ఇంటిని మంజూరు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నకిలీ నోట్ల కలకలం

● ఒకే నంబర్‌తో మూడు 500 నోట్లు



ఒకే నంబర్‌తో ఉన్న మూడు రూ.500 నోట్లు

చేర్యాల(సిద్దిపేట): మండలంలో నకిలీ నోట్లు కలకలం రేపాయి. వివరాల్లోకి వెళితే... ముస్త్యాల గ్రామంలో ఓ షాపు యజమానికి అదే గ్రామానికి చెందిన వ్యక్తి గడిచిన వారం రోజుల్లో మూడు నకిలీ నోట్లు ఇచ్చాడు. అతడు ఇచ్చిన మూడు రూ.500 నోట్లు అన్నీ ఒకే నంబర్ కలిగి ఉన్నాయి. కాగా వారం రోజుల క్రితం ఒక నోటు ఇచ్చి వస్తువులు కొనుగోలు చేసిన సదరు వ్యక్తి 15వ తేదీన మరొక నోటు, ఆదివారం మరో నోటు ఇచ్చినట్లు సమాచారం. నోటు ఇచ్చిన సమయంలో అనుమానం వచ్చిన షాపు యజమాని సదరు వ్యక్తిని ప్రశ్నించగా నాకు మా బంధువులు ఇచ్చారని సమాధానం చెప్పినట్లు తెలిసింది. షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా నకిలీ నోట్లను స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

కల్తీ కల్లు విక్రయిస్తే చర్యలు

పాపన్నపేట(మెదక్): జిల్లాలో కల్తీకల్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డీటీఎఫ్ సీఐ గోపాల్ హెచ్చరించారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని గాజులగూడెం, కొత్తపల్లి, అన్నారం, అబ్లా పూర్, యూసూఫ్‌పేట, కొడపాక, పొడ్చన్‌పల్లి, కుర్తివాడ, నార్సింగి గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కల్తీ కల్లు విక్రయించడం నేరమని, దుకాణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పలు కల్లు దుకాణాల్లో సేకరించిన శాంపిళ్లను పరీక్షల నిమిత్తం మెదక్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించనున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు చంద్రయ్య, ఎల్లయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

హుస్నాబాద్‌రూరల్: రోరోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా... స్థానికుల కథనం ప్రకారం... అక్కన్నపేట మండలం కేశాపూర్‌కు చెందిన అఖిల్ (25) హుస్నాబాద్ నుంచి బైక్‌పై గ్రామానికి వెళుతున్నాడు. పోతారం(ఎస్) క్రాసింగ్ దగ్గర వర్షానికి బైక్ అదుపు తప్పిరోడ్డు పక్కన ఉన్న కందకంలో పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వాహనదారులు చూసి 108కి సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.



వాటెన్ ఐడియా..



సాయం సంధ్యలో ఒదిగేలా

చిత్రం అబ్బురం.. జ్ఞాపకం పదిలం

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే

రెప్పపాటులో జరిగిపోయే దృశ్యాలను ఒక్క క్షణంలో ఆవిష్కృతం చేసేది ఒక్క కెమెరానే. కెమెరాలో బందీ అయిన ప్రతి చిత్రం అబ్బుర పరుస్తుంది. చిరకాలం పదిలంగా మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుంది. జ్ఞాపకాలకు శాశ్వతంగా ప్రాణం పోసేది ఫొటో. శ్రామిక జీవుల సౌందర్యం, ప్రకృతి మనోహర దృశ్యాలు, పశుపక్షాదులు, పూలసోయగాలు.. ఇలా పదిలంగా ఉంచేదే చిత్రం. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సాక్షి క్లిక్ మనిపించిన చిత్రాలు.

- సిద్దిపేట / సంగారెడ్డి సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు / మిరుదొడ్డి(దుబ్బాక)



సొంత గూడు నిర్మాణంలో...



మకరందాన్ని పీలుస్తున్న కీటకం



మంజీరా డ్యామ్ ఆవరణలో సీతాకోక చిలుక



ఎదగాలన్న తపన ఉంటే ఎక్కడైనా..



సంధ్య వేళ..పక్షుల సందడి



పచ్చని పొలాల సోయగం



కాకి 'బలగం'



గూడు వద్ద రామచిలుక..

అరటి సాగు.. బాగు



జహీరాబాద్ ప్రాంతంలో పండిస్తున్న అరటి తోట

ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- పెరుగుతున్న విస్తీర్ణం
- జిల్లాలో సుమారు 2వేల ఎకరాల్లో సాగు

జహీరాబాద్ టౌన్: అరటికి ఏ సీజన్‌లోనైనా మంచి డిమాండ్ ఉంటుంది. ఏడాది పొడవునా సాగుకు అనుకూలంగా వాణిజ్యపరంగా అత్యంత ప్రాధాన్యత సంతరిచుకోవడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. అరటి పంటతో పాటు పిలకలు, ఆకులకు గిరాకీ ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులతో అధిక లాభాలు సాధించవచ్చు. జిల్లాలో జహీరాబాద్, నారాయణ ఖేడ్ తదితర ప్రాంతాల్లో రైతులు అధిక విస్తీర్ణంలో అరటి పంటను సాగు చేస్తున్నారు.

జిల్లాలో ఏడాది పొడవునా అరటికి అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఎర్రటి, నల్లరేగడి నేలలు సాగుకు అనుకూలం. జహీరాబాద్ డివిజన్‌లో వ్యవసాయ బావులు ఎక్కువగా ఉండటంతో నీటి తడులకు ఢోకాలేదు. జిల్లాలో జహీరాబాద్, కోహీర్, రాయికోడ్, ఝరాసంగం, న్యాల్‌కల్, గుమ్మడిదల, కొండాపూర్ తదితర మండలాల్లో అరటి ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. జహీరాబాద్ డివిజన్‌లో సాగు విస్తీర్ణం ఎప్పుడు తగ్గడం లేదు. ఒక్క జహీరాబాద్ డివిజన్‌లోనే ప్రతి సంవత్సరం సుమారు 500 పైగా ఎకరాల్లో పంట సాగవుతుంది. జిల్లా మొత్తం కలిపి సుమారు 2వేల ఎకరాల్లో అరటి పంటను రైతులు పండిస్తున్నారు. గతంలో మనూర్ మండలంలో పెద్ద ఎత్తున పండించే వారు. మంచి దిగుబడి వచ్చినా కొనడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో పంట సాగు పట్ల రైతులకు ఆసక్తి తగ్గింది. ఇప్పుడు అరటికి డిమాండ్ పెరగడంతో పాటు ప్రభుత్వం కూడా ప్రోత్సహించడం వల్ల సాగుకు అన్నదాతలు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రభుత్వ రాయితీ

పండ్ల తోటల సాగును ప్రోత్సహించడంతో భాగంగా ప్రభుత్వం అరటి సాగు విస్తీర్ణం పెంచేందుకు రాయితీ అందిస్తుంది. అరటిని టిష్యూ కల్చర్, పిలకలు, గడ్డల పద్ధతిలో సాగు చేస్తారు. టిష్యూ కల్చర్, పిలకల పద్ధతికి ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీ ఇస్తుంది. ఎకరాకు సుమారు రూ.35 వేల వరకు ఒక్కొక్క రైతుకు 5 ఎకరాల వరకు రాయితీ అందిస్తుంది. డ్రిప్ పరికరాలకు కూడా ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది.

రెండేళ్ల నుంచి మంచి ఆదాయం



50 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్న. దిగుబడి బాగానే వస్తుంది. మూడేళ్ల క్రితం నష్టాలు చవిచూశాం. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇప్పుడు గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ సంవత్సరం మధ్యప్రదేశ్ నుంచి వ్యాపారులు వచ్చి సరైన ధరకు కొంటున్నారు. మూడేళ్ల క్రితం రూ.4 కిలో అమ్ముడు పోగా ఇప్పుడు రూ.20 కిలో చొప్పున కొంటున్నారు.

– నల్ల నాగేశ్వర్ రెడ్డి, రైతు, రంజోల్

మంచి డిమాండ్ ఉంది



అరటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. జహీరాబాద్ డివిజన్ పరిధిలో అనుకూల వాతావరణం ఉన్నందున మంచి దిగుబడులు వస్తాయి, ఈ ప్రాంతంలో అరటి విస్తీర్ణం ఎప్పుడు తగ్గడం లేదు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిస్తున్నందున సాగు విస్తీర్ణం పెరుగుతుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే అరటి సాగులో అధిక లాభాలు సాధించవచ్చు. పంట సాగు విషయంలో అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి. విత్తన శుద్ధి చేపట్టి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

– పందరి, ఉద్యానశాఖ అధికారి, జహీరాబాద్

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మంత్రి దామోదర ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి దామోదర

నర్సాపూర్: భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నర్సాపూర్ మీదుగా శివ్వంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామానికి వెళ్తుండగా స్థానిక ఆర్‌డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్‌లతో పాటు డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పలువురు నాయకులతో పట్టణ శివారులో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అతి నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని, నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను గమనించాలని ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఎవరైనా నివసిస్తుంటే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. చెరువులు కుంటలను పరిశీలించాలని, పేదల ఇండ్లు కూలిపోతే నివేదిక ఇవ్వాలని సూచించారు.

జాతీయ క్రీడలకు విద్యార్థులు ఎంపిక

అభినందించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు



ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): కొండపాక హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యా పత్యా జాతీయ క్రీడలకు ఎంపికయ్యారని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబర్‌లో మహారాష్ట్రలో జరిగే జాతీయ క్రీడలకు ఎస్ శరణ్య, ఎం.శ్రీరామ్, సీహెచ్ సాత్విక తెలంగాణ జట్టులో ఎంపికయ్యారు. దీంతో ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా రంగాల్లో విద్యార్థులు రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణ గౌరవాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అనంతుల ప్రశాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

- తండ్రీకొడుకు మృతి
- చంద్లాపూర్, గంగాపూర్ గ్రామాల్లో విషాదం



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆ తండ్రీకొడుకుల అనుబంధంపై విధికి కన్నుకుట్టింది. వారిని శాశ్వతంగా విడదీసింది. పెళ్లి వేడుకల ఆనందం ముగియకముందే ఆ కుటుంబంలో శోకం మిగిల్చింది. వారి మరణం రెండు గ్రామాల్లో విషాదం మిగిల్చింది. మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామానికి చెందిన మూర్తి గజేందర్ రెడ్డి(50)కి భార్య పద్మ, కుమారుడు రాజిరెడ్డి(27), కూతురు సంతోషి ఉన్నారు. వీరికి గంగాపూర్ శివారులో ఎకరం సాగు భూమి ఉంది. ఆ భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 14న కూతురు సంతోషి పెళ్లి ఘనంగా జరిపించారు. పెళ్లి పనులు పూర్తి కావడంతో సోమవారం తండ్రి, కొడుకు అడవి పందుల బెడద నుంచి మొక్కజొన్న పంటను రక్షించేందుకు వైరు చుడుతున్నారు. ఈ క్రమంలో విద్యుదాఘాతంతో తండ్రి, కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. పెళ్లింట విషాదం నెలకొనడంతో ఇటు చంద్లాపూర్, సాగు చేస్తున్న గంగాపూర్ గ్రామాల్లో విషాదం నెలకొంది. ఘటనా స్థలానికి చేరుకున్న రెండు గ్రామాల ప్రజలు, బంధువులు తండ్రి, కొడుకు మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

చేపల వేటకు వెళ్లి.. అదృశ్యం



దుర్గేశ్

కొల్చారం(నర్సాపూర్): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు కనిపించకుండా పోయాడు. ఈ ఘటన మండలంలోని ఎనగండ్ల గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబీకుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఏషబోయన దుర్గేశ్ ఆదివారం ఉదయం గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి సమీపంలోని మంజీరా నదికి చేపల కోసం వెళ్లాడు. సోమవారం సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సోదరుడు నర్సింహులు పేర్కొన్నాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



విట్టల్

ఝరాసంగం(జహీరాబాద్): గ్యాస్ లీకైన ఘటనలో మరో వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా... మండలంలోని ఏడాకులపల్లి గ్రామంలో ఈనెల 6న గ్యాస్ లీకై మంటలంటుకొని ఒకే కుటుంబంలోని తల్లి శంకరమ్మతో పాటు కుమారులు ప్రభు కుమార్, విట్టల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈనెల 6న తల్లి, 15న ప్రభు కుమార్ మృతి చెందారు. సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్న కుమారుడు విట్టల్(32) మృతి చెందాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. భార్యతో పాటు కుమారులకు అంత్యక్రియలు నిర్వహించిన తండ్రి బక్కన్న గుండెలవిసేలా ఏడ్చారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు

తల్లి మృతి, కుమారుడికి స్వల్ప గాయాలు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి చెందగా, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా, నిజాంపేట మండలం.. బాచుపల్లి గ్రామానికి చెందిన పరమేశ్, తల్లి సంతోష (48) ఇద్దరు కలిసి బైక్‌పై ఆదివారం కూలీ పనికి ఇస్నాపూర్‌కు వచ్చారు. పని దొరకకపోవడంతో తిరిగి సోమవారం మధ్యాహ్నం ఇస్నాపూర్ నుంచి వెళ్తుండగా రుద్రారం సమీపంలోని సిగ్నొడ్ కంపెనీ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న సంతోష కిందపడగా, ఆమె తలపై నుంచి బస్సు టైర్ వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఆరూర్ శివారులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్యామ్రావు(46) పది రోజుల క్రితం బతుకుదెరువు నిమిత్తం సదాశివపేట పట్టణానికి వచ్చాడు. ఉదయం ఆరూర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హత్య కేసులో జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైమ్ : హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు శిక్ష పడింది. సంగారెడ్డి పట్టణ పోలీసుల వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన సంజయ్ లక్ష్మణ్ కంబై వృత్తిరీత్యా కూలి పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో 2020 జూన్ 7వ తేదీన తోటి అల్లుడు ఉత్తమ రామ యాడ్కెను కొత్త బస్టాండ్ సమీపంలో గల ప్రింటర్ ప్రెస్ ఎదుట బండరాయితో తలపై కొట్టి చంపాడు. అప్పటి ఇన్‌స్పెక్టర్ రమేశ్ కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలతో నిందితున్ని కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వపరాలు విన్న జిల్లా న్యాయమూర్తి భవాని చంద్ర నిందితునికి జీవిత ఖైదుతోపాటు రూ. 3వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు. ఎస్‌హెచ్‌ఓ, ఇన్వెస్టిగేషన్ అధికారి వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ పి.రమేశ్ తదితరులను జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ అభినందించారు.

మందుబాబులకు జరిమాన

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్ చెరు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ వివరాల ప్రకారం... ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 21 మందికి మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున , మరో ఇద్దరికి రూ. 1500, మరో వ్యక్తికి రూ.2 వేలు, మరో వ్యక్తికి రూ. 2500 జరిమాన విధించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గంజాయిని విక్రస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఎస్‌ఐ కృష్ణారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి రోడ్డులో కాళేశ్వరం కాల్వ సమీపంలో బైక్‌పై వెళుతుండగా తనిఖీ చేయగా 700 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీస్ సిబ్బంది జనార్దన్, శశికాంత్, ఖాజా, లింగం, రవి, సత్యనారాయణ, మహేశ్ పాల్గొన్నారు.

మైనర్‌పై అత్యాచారం..

నిందితునికి 20 ఏళ్ల జైలు, జరిమానా

దుబ్బాకరూరల్: బాలికపై అత్యాచారం చేసిన నిందితునికి పోక్సో కేసులో కోర్టు కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధించింది. సిద్దిపేట సీపీ అనురాధ వివరాల ప్రకారం... అక్బర్‌పేట - భూంపల్లి మండలానికి చెందిన పర్స శ్రీనివాస్(48) 2022, ఫిబ్రవరి 16న రాత్రి 10.30గంటలకు బహిర్భూమికి వెళ్లిన బాలిక నోట్లో చున్నీ కుక్కి లైంగికదాడి చేశాడు. బాలిక కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి దుబ్బాక సీఐ ఎం.కృష్ణ కేసు పరిశోధన చేసి నేరస్తుడిని జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సోమవారం సిద్దిపేటలోని ఫస్ట్‌క్లాస్ అదనపు డిస్ట్రిక్ట్ కోర్టు, సెషన్స్ జడ్జి శ్రీజయప్రసాద్ వాదనలు విన్న తర్వాత నేరం రుజువైనందున నేరస్తుడికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. ఎస్‌ఐ హరీశ్, సీఐ శ్రీనివాస్, ఏసీపీ రవీందర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, సిబ్బందిని సీపీ అభినందించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

జహీరాబాద్ టౌన్: గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను జిల్లా టాస్క్ ఫోర్స్(డీటీఎఫ్), సంగారెడ్డి టీం సభ్యులు సోమవారం పట్టుకున్నారు. మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద డీటీఎఫ్ బృందం సభ్యులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ట్రావెల్ బస్సులో తీసుకొస్తున్న వివిధ బ్రాండ్స్‌కు చెందిన 74 మద్యం బాటిళ్ల(42 లీటర్ల)ను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న బాటిళ్లను జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో సీఐ వీణారెడ్డి, ఎస్‌ఐలు హనుమంతు, రమేశ్, మురళి, రాజ, ఉమారాణి ఉన్నారు.



డీటీఎఫ్ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

బీడీ పరిశ్రమను కాపాడండి

కేంద్ర మంత్రికి బీఎంఎస్ వినతి

సిద్దిపేటజోన్: గ్రామీణ కుటీర పరిశ్రమ అయిన బీడీ పరిశ్రమను కాపాడాలని కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు సోమవారం తెలంగాణ భారతీయ మాజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని జాతీయ బీఎంఎస్ కార్యదర్శి సురేంద్రన్, అఖిల భారత బీడీ మాజ్దూర్ మహాసంఘ్ ప్రధాన కార్యదర్శి సుధీర్ కుమార్‌లతో కలిసి ఆయన పలు సమస్యలపై వివరించారు. తెలంగాణలో 10 లక్షల మంది బీడీ కార్మికులున్నారని తెలిపారు. ప్రస్తుతం బీడీలపై 18 శాతం జీఎస్టీ ఉందని, పెంచే ఆలోచన విరమించి 5 శాతానికి కుదించాలని కోరారు.



కేంద్ర మంత్రితో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్